క్లుప్తంగా

జూలై 1న సర్వసభ్య సమావేశం

జలుమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జూలై 1వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ వాన గోపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని కోరారు.

యరగాం గ్రామానికి బస్సు సౌకర్యం



గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సు

సరుబుజ్జిలి: మండలంలోని యరగాం గ్రామానికి అధికారులు శుక్రవారం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. గతంలో ఉన్న బస్సు సర్వీసును కొన్ని కారణాలు వలన అధికారులు నిలిపివేశారు. బస్సు పునరుద్దరణ కోసం టీడీపీ యువనేత గురువు తిరుమలరావు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అధికారులతో మాట్లాడి గ్రామానికి బస్సు ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సబ్ స్టేషన్‌లో మరమ్మతులు



మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

హిరమండలం: స్థానిక సబ్‌స్టేషన్‌లోని తులగాం రూరల్ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల పనులు శుక్రవారం చేపట్టారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ సరఫరాలో ఎటువంటి అవాంతరాలు లేకుండా చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు విద్యుత్ లైన్‌లో లోపాలను సరిచేశారు. టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ శంకరరావు నేతృత్వంలో సిబ్బంది రోజంతా పనులు చేపట్టారు. సాయంత్రం తిరిగి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని ఏఈ తెలిపారు.

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులతో ఉపాధ్యాయులు, దాతలు

హిరమండలం: మండలంలోని పింద్రువాడ కాలనీ పాఠశాల విద్యార్థులకు పలువురు దాతలు వితరణగా విద్యా సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయురాలు దీనకుమారి వాటిని శుక్రవారం అందించారు. అలాగే హిందీ పండిట్ తారక రామారావు తన భార్య జ్ఞాపకార్థం విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. గ్రామ పెద్దలు వారిని అభినందించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థిని ప్రతిభ



మజ్జి లావణ్య

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ప్రథమ సంవత్సరం ఫలితాల్లో బూర్జ ప్రభుత్వ కళాశాల విద్యార్థిని మజ్జి లావణ్య ప్రతిభ కనబర్చింది. మార్చిలో వెలువడిన ఫలితాల్లో 403 మార్కులు సాధించగా తెలుగు, ఫిజిక్స్ పేపర్లకు ఇంప్రూవ్‌మెంట్ కోసం ఫీజులు చెల్లించి సప్లమెంటరీ పరీక్షలు రాసింది. ఈ ఫలితాల్లో లావణ్య 37 మార్కులు అదనంగా కలిసి మొత్తం 440 మార్కులు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు, రవీంద్రనాథ్ ఠాగూర్ తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

రాయితీపై విత్తనాలు పంపిణీ

జి.సిగడాం: మండలంలోని పున్నాం గ్రామంలో సర్పంచ్ సుంకరి అప్పన్న అధ్వర్యంలో రైతులకు శుక్రవారం రాయితీపై వివిధ రకాల వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతుకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఎరువుల కూడా రైతుకు సకాలంలో పంపిణీ చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ కుమరాపు సుగణకరరావు, నాయకులు సత్యం, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న దేవీ విగ్రహానికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు చేపట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సరుబుజ్జిలి: శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సరుబుజ్జిలి పంచాయతీలో సర్పంచ్ బొడ్డేపల్లి చాందిని ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. మురుగు కాలువలు, బోరు బావుల వద్ద శుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బుడుమూరు అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత బొడ్డేపల్లి హరి పాల్గొన్నారు.

విరివిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

సారవకోట: గ్రామాల్లో విరివిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని అలుదు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. రహదారికి ఇరువైపులా మల విసర్జనలు చేయడం వలన ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశం ఉందన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు. మురుగు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో రాంబాబు, ఏపీఎం గోవిందరాజులు తదితరులు ఉన్నారు.

నరసన్నపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రత్యేక అధికారి, వికలాంగుల శాఖ ఏడీ కవిత అన్నారు. దేవాది, కోమర్తిల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు మొదలవ్వడంతో ముందుగానే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచితే వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. మంచి నీటి ట్యాంకులను క్లీన్ చేయాలని ఆదేశించారు. దేవాదిలో సర్పంచ్ మంతిన రాము ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమెతో పాటు ఎంపీడీవో రామకృష్ణ, ఉపాధి ఏపీవో యుగంధర్ తదితరులు ఉన్నారు.

కొత్తూరు: మండలంలోని గూనభద్ర అపోజిట్ పునరావాస కాలనీలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు జరిగాయి. పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా కాలనీలో ఉన్న కాలువల్లో పిచ్చి మొక్కలు, చెత్త పేరుకుపోవడంతో గత రెండు రోజులు నుంచి సర్పంచ్ పెదకోట సాదుబాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. తొలగించిన చెత్తను ప్రత్యేక వాహనాలు ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు.



నరసన్నపేట: పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న ఏడీ కవిత



సరుబుజ్జిలి: పారిశుద్ధ్య పనులు చేపడుతున్న దృశ్యం



కొత్తూరు: కాలువల్లో చెత్తను తొలగిస్తున్న కార్మికులు



సారవకోట: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

'రామరాజు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం'



విద్యార్థి, హెచ్‌ఎంను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

పాతపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని హెచ్‌ఎం టి.అన్నాజీరావు అన్నారు. మండలంలోని ఎస్.ఎస్.మనుగు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి సవర చరణ్ కుమార్, పాఠశాల హెచ్‌ఎం అన్నాజీరావును శుక్రవారం సత్కరించారు. చరణ్‌కు నగదు ప్రోత్సాహకం అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఉపాధ్యాయులందరూ కలిసి పనిచేస్తేనే విద్యార్థులు ఉన్నతంగా రాణిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు పి.రామరాజు, ఉపాధ్యాయులు టి.అబ్బాయి, ప్రశాంత్‌కుమార్ పండా, పి.కోటేశ్వరరావు, ఎస్.దమ్మడు, పి.జీవనరావు, సీహెచ్ కేశవరావు, బి.రామయ్య పాల్గొన్నారు.

మార్కెట్ వేలంపాట ఖరారు



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరు గ్రామ పంచాయతీ మార్కెట్ రోజువారీ ఆశీల వేలంపాట రూ.97 వేలుకు ఖరారైనట్లు ఈవోపీఆర్డీ కె.కృష్ణారావు తెలిపారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన శుక్రవారం మార్కెట్ రోజువారీ ఆశీల వసూలుకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. పాటలో 35 మంది పాల్గొనగా, కూనిబిల్లి అన్నపూర్ణ అత్యధికంగా రూ.97 వేలుకు పాట పడడంతో ఆమె పేరున పాట ఖరారు చేసినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జానికి స్వరూపిణి పాల్గొన్నారు.

1వ తేదీన పింఛన్ల పంపిణీ

ఎల్.ఎన్.పేట: జూలై ఒకటో తేదీన ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించి, అదేరోజు పూర్తి చేయాలని ఎంపీడీవో గిరిబాల పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలన్నారు. ఉదయం 6 గంటలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కొక్క ఉద్యోగి 50 కుటుంబాలకు సంబంధించిన పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. ముందుగానే బ్యాంకుల నుంచి నగదు తెచ్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలి

ఎల్.ఎన్.పేట: పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో పైడి లతశ్రీ రైతులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కలిగించాలన్నారు. రైతులు వరి విత్తనాలు వేసుకుని తక్కువ రోజులే అవుతున్నందున, నీరు నిల్వ ఉంటే విత్తనాల మొలక శాతం తగ్గిపోతుందని హెచ్చరించారు. వరి వెదలు, నారు మడులు సిద్ధం చేసుకున్న రైతులు పొలంలో నీరు లేకుండా చేయడం వలన విత్తనాలకు నష్టం జరగదన్నారు. కలుపు నివారణ మందులపైన అవగాహన కలిగించాలని సూచించారు.

ఆశీల వేలంపాట నేడు

కొత్తూరు: మండల కేంద్రంలోని కర్లెమ్మ మార్కెట్ రోజువారీ ఆశీల వసూలు వేలంపాట ఈనెల 29వ తేదీన సాయంత్రం 3 గంటలకు గ్రామ సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రామనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాటలో పాల్గొనేవారు ప్రకటనలో తెలిపినవిధంగా పత్రాలు సమకూర్చుకొని పాల్గొనాలని కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

సారవకోట: మండలంలోని చీడిపూడి గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామివారిని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం దర్శించుకున్నారు. మూడు రోజులుగా ఈ ఆలయ వార్షికోత్సవాలు జరుగుతుండగా చివరి రోజు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, స్థానిక నాయకులు కత్తిరి రమణ, నిక్కు జనార్ధన, పంచిరెడ్డి రమణ తదితరులున్నారు.

దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎస్‌ఐ జీవీ ప్రసాద్

బూర్జ: దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జీవీ ప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పగలు, రాత్రి వేళల్లో ఇళ్లకు తాళాలు వేసుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు వెళ్లినప్పుడు ఇరుగు పొరుగువారికి చెప్పాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే స్థానిక పోలీసు స్టేషన్‌కు తెలియజేయాలని కోరారు.

కళా విలాసం కరపత్రం ఆవిష్కరణ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం, శ్రీసుమిత్ర కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ద్విశతావధాన కళా విలాసం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఉదయం 10 గంటలకు అనివెట్టి మండపంలో ఆవిష్కరిస్తున్నట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సత్తాచాటిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులు

ఆమదాలవలస: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన పీజీ సెట్ ఫలితాల్లో సత్తా చాటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ఎన్ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చరిత్ర విభాగంలో జె.నవీన్ అనే విద్యార్థి 19వ ర్యాంకు సాధించాడని వెల్లడించారు. వాణిజ్య శాస్త్ర విభాగంలో కె.రసజ్ఞకు 24వ ర్యాంకు, రాజనీతి శాస్త్ర విభాగంలో బి.సంతోష్ కుమార్‌కు 99వ, అర్థశాస్త్ర విభాగంలో ఎస్.లోకేష్ 177 ర్యాంకు సాధించి సత్తాచాటారన్నారు. అదేవిధంగా రాజనీతి శాస్త్ర విభాగంలో జి.మణికంఠకు 302వ ర్యాంకు, చరిత్ర విభాగంలో ఎస్.మీనా కుమారి 332వ ర్యాంకు, వాణిజ్య శాస్త్ర విభాగంలో కె.గణేశ్వరరావు 458వ ర్యాంకును కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. దీంతో విద్యార్థులు కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.



జె.నవీన్



కె.రసజ్ఞ



బి.సంతోష్



ఎస్.లోకేష్

క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సత్యస్వరూప్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్: క్యాన్సర్‌ను మొదటి దశలో గుర్తిస్తే ప్రాణాంతకం కాదని రిమ్స్ వైద్యులు డాక్టర్ సత్య స్వరూప్ తెలిపారు. నగరంలోని సన్ షైన్ స్కూల్లో లైన్స్ క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యంలో చైల్డ్ హుడ్ క్యాన్సర్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గుండెపోటు తర్వాత ప్రపంచవ్యాప్తంగా అత్యధిక మరణాలకు కారణవుతున్న మహమ్మారి క్యాన్సర్ అని పేర్కొన్నారు. ఔషధాలు, చికిత్స ఉన్నప్పటికీ సకాలంలో గుర్తించకపోతే వ్యాధి ప్రాణాంతకమవుతుందన్నారు. ఆగని దగ్గు, పేగుల కదలికల్లో మార్పులు, గడ్డలు, వాపులు, పుట్టుమచ్చల్లో మార్పులు, కారణం లేకుండా బరువు తగ్గడం, తగ్గని నొప్పులు, ఆహారం మింగడానికి ఇబ్బంది పడటం, మూత్రంలో రక్తం పడటం తదితర లక్షణాలు క్యాన్సర్ వ్యాధి బారిన పడిన వారిలో కనిపిస్తాయన్నారు. చిన్నారులు బయట కాకుండా ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో లైన్స్‌క్లబ్ హర్షవల్లి జోనల్ చైర్‌పర్సన్ కరణం శోభారాణి, విశ్రాంత అడిషనల్ డీఎంహెచ్‌ఓ లయన్ డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్, ఉపాధ్యక్షులు లయన్ వావిలపల్లి జగన్నాథనాయుడు, సన్ షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రదీప్, ట్రెజరర్ తర్లాడ అప్పలనాయుడు, లక్ష్మీకాంత్, మణిశర్మ, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'పాత పింఛన్ విధానం అమలు చేయాలి'

రణస్థలం: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని ఆపస్ జిల్లా అధ్యక్షుడు దుప్పల శివరామ్ ప్రసాద్ కోరారు. మండలంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రణస్థలం మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 117జీవో రద్దు చేయాలని, పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ సమావేశంలో ఏపీయూఎస్ రణస్థలం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆపస్ మండల అధ్యక్షుడిగా జి.చిన్నికృష్ణం నాయుడు, ప్రధాన కార్యదర్శిగా సింగూరు రాజు, ఆర్థిక కార్యదర్శిగా బి.కుమార్, ఉపాధ్యక్షుడిగా వి.వేణుగోపాల్‌ను ఎన్నుకోవడం జరిగింది. సమావేశంలో జిల్లా కార్యదర్శులు ఎం.రవిభట్టు, జి.గిరి, ఎస్.శ్రీధర్, ఎల్.సత్యం తదితరులు ఉన్నారు.

డ్వామా పీడీ చిట్టిరాజు సుడిగాలి పర్యటన



ఇల్లాయిపురంలో రాతికట్టలు పరిశీలిస్తున్న పీడీ చిట్టిరాజు తదితరులు

మెళియాపుట్టి: మండలంలో శ్రీకాకుళం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు జీవీ చిట్టిరాజు శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. మండలానికి పారిశుద్ధ్యంపై ప్రత్యేక అధికారిగా నియమించడంతో ఇల్లాయిపురం, పెద్దపద్మాపురం గ్రామాల్లో మురుగు కాలువలను, చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మామిడిగుడ్డి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన రాతికట్టలను పరిశీలించారు. గొట్టిపల్లి, నేలబొంతు గ్రామాల్లో ఫారం పాండ్స్, మెళియాపుట్టి మండల కేంద్రంలో కోనేరు చెరువును పరిశీలించారు. రైతులకు ఉపయోగపడే విధంగా కాలువలు, ఇతర పనులు చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో భాస్కరరావు, ఈవోపీఆర్డీ తారకేశ్వరి, మండల పరిపాలనా అధికారి తిరుపతిపట్నాయక్, ఏపీవో రవి, ఈసీ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం శక్తి సంఘాలకు రుణాలు



మాట్లాడుతున్న ఫీల్డ్ ఆఫీసర్ కామేష్

ఆమదాలవలస: స్వయం శక్తి సంఘాల్లో పంచ సూత్రాలు పాటిస్తూ ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంఘాలకు మైక్రో క్రెడిట్ ప్లాన్ ప్రకారం అవసరమైనంత రుణాలు మంజూరు చేస్తామని ఆమదాలవల ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ కామేష్ తెలిపారు. పట్టణంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వెలుగు ఏపీఎం పైడి కూర్మారావుతో కలిసి శుక్రవారం మాట్లాడారు. స్వయం శక్తి సంఘాల్లోని మహిళలు ఆదాయాభివృద్ధి కార్యక్రమాలకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరివిగా రుణాలు మంజూరు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి, క్లస్టర్ కో–ఆర్డినేటర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు తదితరులు

హిరమండలం: పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవిందరావు జన్మదిన వేడుకలను నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ పండగలా నిర్వహించాలని టీడీపీ నాయకుడు నందిగాం సాయికృష్ణ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గోవిందరావుతో పాటు హిరమండలం జెడ్పీటీసీ పొగిరి బుచ్చిబాబు, నాయకులు చెట్టు శ్రీను, బర్రి సురేష్, వడ్డి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

'బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి'



హిరమండలం: గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హిరమండలం: బడి ఈడు కలిగిన పిల్లలు కచ్చితంగా బడిలో ఉండాలని ఎంఈవో కె.రాంబాబు అన్నారు. మండలంలోని పింద్రువాడ కాలనీలో బడికి పోతాం కార్యక్రమంలో భాగంగా ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెడుతోందని, సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు రాయితీలు అందిస్తున్న విషయం గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, దీనకుమారి, గిరిబాబు, తారక రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ మేరకు కంబకాయ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వైకుంఠరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని, తల్లిదండ్రులు గమనించాలని కోరారు.

సామూహిక అక్షరాభ్యాసాలు



అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం

హిరమండలం: స్థానిక పింద్రువాడ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి చిన్నారుల తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. ఉపాధ్యాయులు ఇచ్చిన పిలుపు మేరకు గ్రామంలో ఎక్కువ మంది పూర్వ ప్రాథమిక విద్య చదివేందుకు ముందుకొచ్చారు. ముఖ్య అతిథిగా ఎంఈవో రాంబాబు విచ్చేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమార్, దీనకుమారి, గిరిబాబు, తారక రామారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య'



మాట్లాడుతున్న హెచ్‌ఎం నారాయణరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ముద్దాడ బీసీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం టి.నారాయణరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రుల భాగస్వామ్యం పాఠశాల విద్యలో కీలకమన్నారు. ప్రభుత్వం పుస్తకాలు, స్టూడెంట్ కిట్లు, మధ్యాహ్న భోజనం వంటివి అందజేస్తోందని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన విద్యా బోధన అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యాయులు కె.కొండయ్య, బి.భవానీ పాల్గొన్నారు.